కథ 1996

1



# ఎలుకల బోను

నవులూరి వెంకటేశ్వరరావు

ఇద్దరికీ రెండుసార్లు గుండెనొప్పి వచ్చి ఆస్పత్రి పాలయి ఉన్నారు గతంలో. ఒకే భయం వాళ్లను పీడిస్తూ వచ్చింది. అది చావు గురించినది కాదు. ఎందుకంటే వాళ్లు ఎదురుచూస్తున్నదే దాని గురించి.

ఒకేదాని గురించి ఎదురు చూస్తూ వచ్చిన ఆ ఇద్దరూ, కలిసి జీవిస్తూ వచ్చి నెలా పదిహేను రోజుల క్రితం విడిపొయ్యారు.

ఆరోజు ఒక నాలుగురోడ్ల కూడలిలో ఒకరికొకరు ఎదురయ్యారు. కనబడితే బాగుండు అన్న కోరికతోనే నగరంలోకొచ్చాడు. అదే ఉద్దేశంలో ఆమె కూడా బజారు కొచ్చింది. గత నలభై అయిదు రోజులు వేరువేరుగా, ఒంటరిగా గడిపారు. ఆమె నగరంలో నాగరికత మధ్య, అతను నగరపు, నాగరికతల అంచున. ఆ జీవితం అనుదినం మరీ దుర్భరంగా తోచింది ఇరువురికీ. ఇద్దరి మధ్య ఎలాంటి సంబంధం నెలకొని ఉందో ఉభయులకూ అర్థం కాని విషయం. దాని స్వభావం ఎలాంటిదైనా కలిసేతప్ప వేరువిధంగా గడపలేరు అన్న విషయం ఈసారి మరీ స్పష్టంగా తేలిపోయింది.

కలుసుకునే అవకాశం పూజ్యం అనుకుంటూ, మనసులో ఏ మూలో కలవకపోతామా అన్న ఆశతో గమ్యరహితంగా ఆ నగరంలో తచ్చాడుతున్న సందర్భాన ఆ కలయిక కలిగించిన ఆనందం పంకజం, చలపతి ఇరువురిలో క్షణం కనిపించింది. ఒకరి సాంగత్యం కోసం మరొకరు ఎదురుచూశారన్న విషయం ఎదుటివాళ్లకు తెలిసిపోతుందేమోనని అహం అడ్డొచ్చి ఆనందపు ఛాయలను మరుగుపరిచింది.

''ఎలా గడుపుతున్నావ్?''

''మీరెలా గడుపుతున్నారు?''

''ముందు అడిగిన ప్రశ్న నాది.''

''మీలాగే.''

''నీ ఈ సమాధానం దృష్ట్యా, నీ ప్రశ్నకు వేరే సమాధానం చెప్పక్కరలేదు.''

బత్తాయిపళ్లు బేరమాడుతోంది. అది కుదిరి డజను కొని ప్లాస్టిక్ బ్యాగులో వేసుకుంటూ అడిగింది.

''మీరెందుకు ఊళ్లోకొచ్చారు?''

''నిజం చెప్పాలో, అబద్ధం చెప్పాలో తోచటం లేదు.''

''మీరేం చెప్పినా అది అబద్ధమో నిజమో తేల్చుకోగలను.''

''నీవు కనబడకపోతావా అని... చెప్పు! ఇది నిజమా? అబద్ధమా?''

''నిజమే అయివుండొచ్చు.''

''నీవూ అదే ఉద్దేశంతో తిరుగుతున్నావేమో! అందుచేత నా సమాధానాన్ని నిజంగా భావిస్తున్నావ్. అవునా?''

''మీరొక స్థిరాభిప్రాయానికి వచ్చిన తర్వాత, మీ సామర్థ్యం మీద మీకు అంత నమ్మకం వున్నప్పుడు, నా ధ్రువీకరణ ఎందుకు?''

''ఇప్పటికన్నా నీ పట్టుదల మానుకుని వస్తావా?''

పంకజం మాట్లాడలేదు. వెళ్లిపోతున్న రిక్షాను పిలిచి ఎక్కించి ఆమెతో వెళ్లాలో, తన దారి తాను చూసుకోవాలో తెలీక అతను నిలబడే వున్నాడు. పక్కన చోటుంచి, ''నిలబడిపోయారేం, రండి,'' అంది. అన్నదే తడవు ఆమె పక్కన చేరాడు, రిక్షా కదిలింది. పాత

నగరపు ఇరుకు సందులు, వాటి మలుపులు తిరిగి ఒక ఇంటి ముందాగింది రిక్షా. "ఆటో మాట్లాడండి. ఈలోపు కొద్ది సామాను సర్దుకుని తయారవుతా," అంది, డబ్బు లిచ్చి రిక్షాను పంపుతూ.

దూరపు బంధువులింట్లో వుంటోంది. బెట్టుసరిగా రోజులు లెక్కబెట్టుకుంటూ. 'రోజులు లెక్కబెట్టడం,' అనేది చలపతి మీద ప్రేమ కారణంగా కాదు. ఒక విధ మయిన జీవితానికి అతనితో ఇంతవరకు అలవాటు పడిపోయి, దానికి భిన్నమయిన దానితో ఇప్పుడు సమాధానపడలేక.

క్షణం కూడా వృధా చేయకుండా తయారయి పోయింది. మూటాముల్లే కట్టుకుని బంధువులకి విషయం చెప్పి సెలవు తీసుకుని, వీలు చూసుకుని కొత్త ఇల్లు చూడటానికి రమ్మని ఆహ్వానించింది.

ఆటో ఎక్కబోతున్న మనిషి లోపలికి తిరిగి వెళ్లి, "ఇది మరిచిపొయ్యా," అంటూ ఎలుకల బోనుతో వచ్చింది.

"ఛా అదెందుకు. మనం వుంటున్నది కొత్త ఇల్లు. ఎలుకలు సాధారణంగా రావు."

"చిరకాలం నించి మన దగ్గిర ఉన్న వస్తువు. బరు వైనదేం కాదుగదా! మన పాత ఇంటికి వెళ్లినప్పుడు, 'ఇది మరిచిపోయారండీ,' అంటూ ఆ ఇల్లుగలావిడిచ్చింది. ఈ రకపు బోను దొరకదిపుడు. జంటలు జంటలుగా ఎలుకలు పడేవి కదా ఇందులో."

ఆటో బయలుదేరింది.

గడిచిన కొద్ది దినాల అనుభవం మననం చేసు కుంటున్నాడు. 'ఈ మొండిది రాదేమోనని' మధన పడ్డాడు. తనకు నచ్చిన ఆ పరిసరాల్లో ఇల్లు కట్టడం మొదలుపెట్టిన దగ్గిరనుంచి పూర్తయినదాకా ఎడతెగని తగవు. ఇల్లయి పోగానే అది పరాకాష్టకు చేరింది. 'ఆ వనవాసం నేను చెయ్యను. నేను సీతనూ కాదు ఆ ఇంటికి రానని,' భీష్మించింది.

"వస్తేరా, రాకపోతే పో. నాకు సంబంధించినంత వరకూ నీ తోడూ, ఉనికి అవసరాలు గతంలో అవసర మనిపించలేదు, ఇకముందు అనిపించదు," కోపంగా అని సామానంతా లారీకెత్తించి, అద్దె ఇంటి తాళం వేసి ఇల్లుగల వాళ్లకిచ్చేశాడు. తన సామానుతో ఆ బంధువు ఇల్లు చేరింది.

*

కొత్త ఇల్లు విశాలంగా పెద్ద పెద్ద కిటికీలతో, గాలీ వెలుతురులను ఆహ్వానిస్తూ బాగుంది అనుకుంది. హాల్లో కూర్చుని పేపరు చూస్తోంది. కాలింగ్‌బెల్ మ్రోగింది. హాలు కిటికీలోంచి వచ్చిందెవరాని చూసింది. గేటు కవతల ఒక ఆడమనిషి నెమలికంఠం చీరలో నిలబడి ఉంది. ఆమెకవతల రోడ్డు మీద మగ మనిషి, హాలు తలుపుతీసి,

"ఎవరు కావాలి?" అంది.

"ఎవరూ అక్కర్లేదండి," అన్నదా మనిషి.

ఈలోపల పడక గదిలోనించి బయటికొచ్చాడు చలపతి, "రానీలే," అని భార్యతో అని (ఆమె అడ్డు న్నట్లు), "రామ్మా రా," అన్నాడు వచ్చినామెతో.

ఆమె ఇంటి పక్కనించి వెనక్కు వెడుతుండగా అర్థమయింది. "సింకులో నాలుగు గిన్నెలున్నాయి, తీసుకెళ్లి బాత్రూం ముందు పడెయ్యి," అన్నాడు భార్యతో. వెళ్లింది. వచ్చినామె అరటిచెట్టు నానుకుని వయ్యారంగా నిలబడి ఉంది. అంట్లు పడంగానే బక్కెట్ తో పంపు దగ్గిర నీళ్లు పట్టి తెచ్చుకుని, గిన్నెలకు సబీనా పట్టిస్తోంది. వరండాలోకొచ్చి కూర్చుంది.

దూరంగా ఘనీభవించినట్లు కనిపిస్తోంది సముద్రం. తనకైతాను సంకెలలు తగిలించుకున్న మృగంలా తోస్తోందది.

పనిమనిషితో వచ్చిన వ్యక్తి ఇంటికి కాస్త అవతల ఉన్న మామిడిచెట్టు కొమ్మల్లో కూర్చుని ఉన్నాడు. ఆమె కన్నా పొట్టిగా వున్నాడు. ఆమెకన్నా వయసులో చిన్న వాడిగా కనిపిస్తున్నాడు. పనంతా పూర్తి చేసుకుని రావ టానికి గంట పట్టింది పనిమనిషికి. ఆమె వస్తానని కూడా చెప్పకుండా గేటువేసి వెళుతున్నప్పుడు, 'అందమయిన మనిషే,' అనుకుంది పంకజం. ఆమెతో వచ్చిన వాడెవడూ? అన్నా, తమ్ముడా, భర్తా? ఇద్దరూ పిచ్చి మొక్కల్లోనించి నడిచి వెళుతున్నారు. ఆమె నాట్యం చేస్తున్నట్లుంది నడుస్తుంటే. ఎందుకో నవ్వుతోంది... వాడు మెలికలు తిరుగుతున్నాడు. ఆమె అందానికి దిష్టి తగలకుండా, దిష్టిబొమ్మలా వున్నాడు వాడు.

ఇంతలో మరొకామె వచ్చి గేటు ముందు ఆగింది నవ్వుతూ.

"ఎవరండీ?" కుర్చీలోనించి లేచింది పంకజం.

"అదిగో ఆ నీలపు మేడ మాదే. ఎపుడొచ్చారు ఊరినించి?"

"మూడు గంటలపుడొచ్చాను. నిలబడి పొయ్యా రేం, లోపలికి రండి, ఇల్లు చూద్దురుగాని."

"మీ ఇల్లు చాలాసార్లు చూశాను. కడుతున్న ప్పుడు, ఇంట్లో దిగిన తర్వాత గూడా. ఈ ఒళ్లు తగ్గటానికి

పొద్దునా, సాయంత్రం ఈ నడక వ్యాయామం చేస్తుంటా, వస్తా,'' వెళ్లిపోయింది.

ఆమె శరీరమంతా బంగారు నగలతో అలంకరించుకుని వుంది. మరిన్ని నగలతో మరింత అలంకరణకు ఆమె శరీరంలో అవయవాలు మిగిలినట్లు లేవు. అవయవాలకు కొదవ, బంగారానికి కాదు. తర్వాత, భర్త ఆమె వివరాలు చెప్పేడు. ఆమె పేరు కనకదుర్గ. భర్త మంచి ప్రభుత్వోద్యోగం చేస్తున్నాడు. లంచం రూపంలో వచ్చే... నిజానికి గుంజే ధనాన్ని దాచుకోటం అతని నిత్య సమస్య. ఆమె సమస్యల్లా భర్తకన్నా మూడురెట్లు పెరిగిపోయిన శరీరాన్ని తగ్గించుకోవటం, లేకపోతే ప్రాణాయామం. వంద గ్రాముల శరీరం బరువు తగ్గినా తులం బంగారం కొన్నంత సంతోషపడుతుంది. జ్వరానికో, లంకణానికో మాత్రమే అన్ని గ్రాముల మేరకన్నా దాన్ని తగ్గించటం వీలుంది. ఆ రెండు అవాంతరాలూ తొలగంగానే శరీరం పూర్వస్థితికి చేరుతుంటుంది. చిత్రమయిన విషయం కరిగించదలచిన కొవ్వును నగలతో అలంకరించడం.

వ్యాయామపు నడకల వేళల్లో కూడా ఆమె జరీ అంచు పట్టుచీరలోనే వుంటుంది. నగలూ తొలగవు. తలకు రంగు వేసుకుంటుంది. చెంపల మీదుగా జుత్తు లాక్కుంటుంది. కళ్లకు కాటుక, నుదుట అర్ధరూపాయంత బొట్టు నిత్యం వుంటాయి. ఆమె శరీరం అంత భారీగా పెరిగిపోయిన కారణంగా మరో ఆడమనిషి అవసరం ఏర్పడింది భర్తకు. వయసు ముదరటం చేత పెళ్లికాని... బహుశా ఇక అవ్వని మరదలిని ఇంటికి తెచ్చాడు. ఆమె, ఆమె మనిషే కాబట్టి అట్టే అభ్యంతర పెట్టలేదు. పైపెచ్చు నగా నాణ్యం విషయంలో ఆమెతో పోటీవుండే ప్రసక్తి లేదని హామీ కూడా ఇచ్చి వుండాలి. మరదలి ఒంటిమీద చిన్నమెత్తు బంగారం ఉండదు.

పంకజానికి తలనొప్పిగా ఉంది. ఇంతసేపు గమనించలేదు ఎందుకో. కాస్తంత దూరంలో వున్న ఇంట్లోనించి గత గంటసేపటి నుంచి కుక్కగోల. పిచ్చేమన్నా పట్టిందో ఏమిటో. ఆ ఇంట్లోవాళ్లు ఎలా భరిస్తున్నారో. పోర్టికో కింద ఆ ఇల్లుగలావిడ పనివాడితో డాన్స్ చేస్తూ ఏదో చెబుతుంటే, వాడూ అదే పని చేస్తూ సమాధానం చెబుతున్నాడు. ఆ కుక్క మొరుగులో ఒకళ్ల మాట లొకళ్లకు వినబడుతున్నాయో లేదో అర్థంకాలేదు పంకజానికి.

*

చెదురుమదురుగా ఇళ్లు లేచాయా ప్రాంతంలో. ఒకదానికొకటి కాస్తంత దూరంలో వుంటాయి. మనుషులూ, 'నన్ను తాకకు నామాలకాకి,' అంటున్నట్లుంటారు. 'ఏవండీ' అంటే 'ఏవండీ'... స్వాభిమానాలు. అహంభావాలు, అంతరాంతరాల్లో దాగి వుండే మానవ సహజమైన ఈర్ష్యా ద్వేషాలు కారణాలుగా.

దక్షిణంవైపు, కుచద్వయాకారపు కొండ మధ్యలో ఎవరూ వెళ్లని గుడి, ఆ కొండ పైభాగమంతా పచ్చటి మొక్కలు, చెట్లు. దిగువ సగమంతా పుట్టకురుపు వ్యాధి కొరికేసినట్లుంటుంది. క్వారీలారీలు తొలిచి తొలిచి. ఒకనాటికి ఈ క్యాన్సర్ పైదాకా పాకుతుంది. ఎడమవైపు మరో కొండ కొంచెం ఎక్కువ ఎత్తుది. దాన్ని ఆక్రమించు కోగలిగినంత మేరకు ఆ పనిచేసిన వందలాది గుడిసెలు. పక్కా ఇళ్లూ. ఆ రెండు కొండల మధ్య బోలెడు ఎడమ. ఆ ఎడమలోనించి దూరంగా, బహు దూరంగా, చాలా పొడవుకు విస్తరించిన కొండ. దూరానికి పచ్చగాగాక ఊదారంగులో ఉంటుంది. అది సముద్రం ముందు మోకరిల్లి, 'నీకన్నా ఎత్తుగా వున్నా నీ బానిసనే,' అంటున్నంత వినయం వ్యక్తం చేస్తుంటుంది. ఈ దూరానికి సముద్రం బుద్ధిగా, ప్రశాంతంగా ఉన్నట్లు భ్రమింపచేస్తుంది. మూడు కొండల అటకాయింపుకూ నగరం ఘూంకరిస్తుంటుంది. ఇంటి దక్షిణ మూల నుంచి చూస్తే అరకిలో మీటరు దూరం పచ్చటి పొదలు, మామిడితోపు, సెంట్రీల్లా అక్కడక్కడా ఎత్తుగా ఎదిగిన తాటిచెట్లు, తలలు విరబోసుకున్న ఈతచెట్లు. ఆరున్నరకల్లా చీకటి ఈ ప్రాంతాన్ని కప్పుతుంది. బాగా దూరాన నగరం వెలిగించుకున్న నకిలీ బంగారపు దీపాల సమూహాలు. పచ్చదనపు ఈ వేరు ప్రపంచం మాత్రం చంద్రుడు లేకపోతే చీకటిమయం. అప్పుడు మిణుగురు పురుగుల జంట చీకటిని వెలుతురు కోతకోసి క్షణకాలం గర్వపడుతుంది. ఆ కోతకు చలించని చీకటి విర్రవీగుతూనే ఉంటుంది. చీకటి విరగడానికి ఎన్ని మిణుగురులయితే సరిపోతాయి?

ఈశాన్యాన కొండకాదుగాని, కొండంత గుట్ట. అదంతా జీడితోట, వేసవిలో జీడిపంట విపరీతంగా పండుతుంది. రోజూ పిక్కలు ఏరి, పళ్లను గుట్టలుగా వదిలేస్తారు. మగ్గి, మగ్గిన ఆ పళ్ల వాసన దిగంతాలకు వ్యాపిస్తుంటుంది గాలితోబాటు. వెగటు వాసన.

ఒకానొకపుడు అడవిలాంటి ప్రదేశం. నాగరికత నిప్పులా రాజుకుందిక్కడ. ఇప్పటికీ చాలా జంతువులు, పక్షులు మరోచోటికి పోవటానికి వీలులేక, చుట్టూ

నగరం వ్యాప్తి చెంది వుండటం వలన ఆ అతి సమీపపు కొండలను, చెట్లను, పుట్టలను, తోటలను ఆశ్రయించి సంచరిస్తుంటాయి. రంగుల పక్షులు కరెంటు తీగెల మీద వాలి ఎవరినో తిడుతున్నట్లు కిచకిచలాడతాయి. నాగరికత చేసే అన్యాయాన్ని నిశీధికి మొరబెట్టు కుంటున్నట్లు నక్కలు ఊళబెడతాయి. ముంగిసలు, ఉడుములు ఈ ప్రాంతంలో వస్తున్న మార్పును కూడా గమనించకుండా అమాయకంగా తిరుగుతుంటాయి. దొరికిపోయిన ఉడుములు మనుషుల కుక్షులు చేరతాయి. విషాన్ని కలిగి వుండటంలో మానవుడితో వున్న బంధుత్వాన్ని చాటుకోడానికన్నట్లు పాములు నిత్యం ఇటు పర్యటిస్తుంటాయి, దొరికి ఛస్తుంటాయి.

ఆరోజు కొండచిలువ వచ్చింది. జీడితోటను దాటి, దారితప్పి. దాని కర్మకాలి. ముగ్గురు దున్నల్లాంటి వ్యక్తులు చితక బొడిచినా మొండికెత్తి చావలేదు. వాళ్లు అంతకంటే మొండిగా, క్రూరత్వంలో మా మనుషులకు నీవు సాటి రాలేవంటూ, చిదుగులూ, కర్రలూ పోగుచేసి దహనం చేశారు సజీవంగా.

"జూలో కాపురమున్నట్లుంది," అన్నది పంకజం.

"అవి ఉండే చోటును దురాక్రమణ చేసి, వాటిని హింసపెట్టి చంపడం ఎంత అన్యాయం!" వాపోయాడు చలపతి.

"ఏ కొండచిలువో, తోడేలో మన ఇంటి ఆవరణలోకి వస్తే అపుడు ఇంత జాలిపడతారా? ఇంత ఉన్నతంగా ఆలోచించి వదిలేస్తారా?"

ఏం సమాధానం చెప్పాలో తెలీక ఊరుకున్నాడు.

కుక్కను విప్పి బయటకు తెచ్చి ఇంటి ముందు తుప్పల్లో తిప్పుతున్నాడు సంబంధన్. అది నోరు మూసుకుంది. ఈకలాంటి సంబంధన్ శరీరాన్ని వెనక్కు విరిచి మరీ కుక్క ఎటుపడితే అటు పోకుండా గొలుసు పట్టుకుని నియంత్రిస్తున్నాడు. దాని పేరు పెట్టి లాలనగా, గౌరవంగా పిలుస్తున్నాడు, అల్లరి పెట్టవద్దని బతిమిలాడుకుంటున్నట్లు. అది చెయ్యాల్సిన ఏ రెండు పనులు గుర్తించి దానికా మాత్రమన్నా స్వేచ్ఛ ఇచ్చాడో, అవి పూర్తయినట్లున్నాయి. పొందిన స్వేచ్ఛను కోల్పోవడానికి, ఆ రెండు పనులు పూర్తవడానికి ముడిపడి వుందని దానికీ తెలిసే వుంటుంది. అయినా, ఆ పనులు ఆపుకోగలిగినవి కాదుగదా! అందువల్ల స్వేచ్ఛను ప్రాణం కన్నా అధికంగా ప్రేమిస్తున్నా, దాన్ని కనీసం పావుగంటన్నా అనుభవించలేకపోతోంది. లోపలికి తీసుకెళ్లి కట్టేశాడు. మొరుగు ఆరంభమయింది. గేటుకావల ఆకు కదిలినా, గాలి వీచినా, మనిషి, పశువుల వాసన పసిగట్టినా మొరుగుతుంది. ప్రపంచానికే కాపలాదారునన్నట్లు అరుస్తోంది. బంధనాన్ని తెంపుకోవటానికి నిరర్థకమైన ప్రయత్నం చేస్తుంది. గొలుసే తెగివుంటే కదిలే ఆకుల్ని ఏం చేసి వుండేదో, వీచే గాలి పీచు ఎలా అణిచేదో, ఏ ఆకూ కదలనప్పుడు, ఏ గాలీ వీచనపుడూ గొలుసు మీద కోపంతో అరిచేది, ఇంట్లోవాళ్లని చీల్చి చెండాడేట్లు అరిచేది. ఈ నిశ్శబ్ద ప్రపంచంలో కుక్క మొరుగు ప్రతిధ్వనిస్తోంది.

కాళ్లొచ్చిన సిరిసంపదల్లా కనకదుర్గగారు రొప్పుతూ ఇంటివైపు నడుస్తున్నారు. గేటులోంచి లోపలికి చూసి, ఆగకుండానే రోజూలాగానే "ఏవండీ," అనబోయి చలపతి కూడా వుండటం గమనించి గొంతు నొక్కుకుని రొప్పుతూ వెళ్లిపోయారు.

పావుగంట గడిచి వుంటుంది. బియ్యం తెచ్చుకుని ఏరటం ఆరంభించింది పంకజం... బియ్యంలోని మట్టిబెడ్డలు నోట్లోకి విసురుకుంటూ.

"ఆ మట్టీమశానం తినటం ఎందుకు? ఆకలిగా వుంటే తినటానికేమైనా తెచ్చుకో."

"తినేది నేను కదా! మీకేం పెట్టటం లేదు."

ఆ సంభాషణ ఏ విధంగా సాగేదో, పార్వతి ఆగమనంతో ఆగిపోయింది. అంగరక్షకుడు మామిడి చెట్టెక్కడానికి వెళ్లాడు.

పార్వతి పనిలో పడింది. రెండు చేతుల చూపుడు వేళ్లగోర్లూ పొడవుగా పెంచింది. పెంచిన గోళ్లకు రంగు వేసింది. పొడవైన సన్నటివేళ్లు. అంట్లుతోమే వృత్తిలో వున్నా వాటి నాజూకుదనం పోలేదు. తెల్లటి శరీర ఛాయ, పొడవైన మనిషి. అనవసరమైన కొవ్వు అవున్స్ కూడా శరీరం మీద వున్నట్లనిపించదు. పసుపుతాడు మినహాయిస్తే బోసిమెడ, బోసితనమూ హుందాగా వుంది.

'పార్వతీ, ఆ మగమనిషెవరూ?' అని అడుగుదామనుకుంది పంకజం. ఎన్ని రోజులనీ కుతూహలాన్ని అణుచుకోటం. నాల్రోజులనాడు భర్త నడిచింది.

"ఎవరైతేనేంలే," అని నవ్వి ఊరుకున్నాడు.

సిందూరం రంగుచీర, దానికి తగిన జాకెట్టూ వేసుకుంది పార్వతి. ఖరీదైనవి కాదు. ఒంటికి నప్పి ఆమె అందంగా కనిపిస్తోంది. అంట్లూ చెంబులూ వేసి ఆ అందాన్ని అవమానిస్తున్నాననే అనిపిస్తుంటుంది పంకజానికి. తన ఇంట్లో కాకపోతే మరో ఇంట్లో పనికి కుదిరి, ఆ అందాలప్రోవు ఆ పనిచేయక తప్పదు భుక్తి గడవటానికి. ఆకలిజ్వాలను ఏదో ఒక పనిచేసి ఆర్పుకో

వటం ప్రాథమిక విషయం. కాస్త జరుగుబాటు వున్నప్పుడు ఈ పనా, ఆ పనా అన్న ఎంపికకు అవకాశం దొరుకుతుంది.

చివరకు పార్వతినే అడిగింది ఆ కుర్రాడెవరని. "మా బంధువులబ్బాయి," ఆ సమాధానం ముక్తసరి గాను, ఆ విషయంలో సంభాషణ కొనసాగటం ఇష్టం లేదు అన్న భావం వ్యక్తం చేస్తూ.

అంట్లు తోమినా, ఇల్లు తుడిచినా, బట్టలుతికినా వయ్యారం ఒలుకుతుంది. అది వింతగా, గమనించీ గమనించనట్లు గమనిస్తుంటారు దంపతులు. ఆ కుర్రాడితో జంటగా రాకపోతే వాళ్లకాపూట లోటు కనిపిస్తుంటుంది. వాళ్లిద్దరి సంబంధం ఎలాంటిదైనా అందులో దంపతులకు ఏదో ఆకర్షణ కనిపిస్తుంటుంది. పార్వతి పని శుభ్రంగా చేస్తుంది. ఏదీ చెప్పించుకోటానికి ఆస్కారం ఇవ్వదు. కూనిరాగాలు తీస్తుంటుంది. గొంతు బండగా వున్నా, ఏదో మత్తు వుంది. నెలయినా జీతం అడగదు. ఇస్తే లెక్కబెట్టుకోకుండా జాకెట్లో దోపుకుంటుంది. లెక్కపెట్టుకో అంటే, "ఈ మాత్రం మూడొందల రూపాయల జీతానికే లెక్కబెట్టుకోవాలటండీ," అంటుంది. ఎంత జీతమయితే లెక్క బెట్టుకుంటుందో తెలీదు.

మరుసటిరోజు పంకజానికి కావలసిన సమాధానం దొరికింది. ఆరోజు పనిమనిషి రాలేదు. నల్ల తుమ్మ మొద్దులాంటి మనిషి గేటు తీసుకుని వరండాలోకి వచ్చేదాకా చలపతి గమనించలేదు. గేటు చప్పుడుకు ఎవరా అని చూడటానికి పంకజం లోపలి నించి బయటికొచ్చింది.

"ఈ రోజు దానికి ఒంట్లో బాగాలేదు. జీతం డబ్బులు అడిగి నన్ను తెమ్మంది సారూ," అన్నాడు.

"వచ్చినవాడు భర్తన్నమాట," అన్నది అతగాడు వెళ్లిపోయిన తర్వాత.

తల వూపి నవ్వేడు చలపతి.

"బాగుంది," అన్నదామె.

రోజులలా గడుస్తున్నాయి. ఎలాగో ఒకలా గడవటమే గదా కావాలి.

*

సంబంధన్ కుక్క ఏడుస్తోంది. ఆయన బయటి నించి ఇంకా రాలేదు. బందిఖానా నించి పొందే రెండు నిమిషాల విముక్తికి సమయం రాలేదు.

పంకజంతోపాటు చలపతి కూడా వరండాలో వున్నా, పంకజాన్ని "ఏవండీ," అని రొప్పుతూ పిల్చి వెళ్లిపోయింది కనకదుర్గమ్మ.

క్షితిజం దగ్గిర పొంచివున్న సముద్రాన్ని చూస్తున్నారిద్దరూ. పనిమనిషి ఎగ్గొట్టింది.

"ప్రియుడితో ఎక్కడికో చెక్కేసుంటుంది," పంకజం అంది.

ఇంటిపని రోజంతా చేసి, సాయంత్రం వరండాలో ఇద్దరూ కూర్చున్నవేళ అతను నవ్వుతూ చూశాడు. ఆ నవ్వు ఇద్దరికీ కొత్తదికాదు. అలా నవ్వటం అతనికి పెళ్లి ముందు నించీ అలవాటుంది. ఆమెకు పెళ్లి తర్వాత దానితో పరిచయం ఏర్పడింది. అది గతంలో ఇద్దరి మధ్య పొట్లాటలకు దారితీసింది. దానికి బదులు డజను తిట్లు తిట్టినా భరించగలదు.

"ఇంతకూ ఏమిటా నవ్వు వెనుక భావం?"

నవ్వు ఆపేడు. నిప్పులా తగులుకుని, తర్వాత ఆగిపోయినా, అది పెట్టిన పెటకం కొనసాగింది.

ఏమీ పట్టించుకోకుండా గూళ్లకు తిరిగి వెళుతున్న పక్షుల మీదికి చూపు సారించాడు. చీకటి ఆరంభమవుతోంది. వాట్ ఏ డల్ లైఫ్ యూ లీడ్ జంటిల్‌మేన్! చెకోవ్ పాత్ర మాటలు గుర్తొస్తున్నాయి. ఆవులించాడు.

"నేను అడిగింది వినబడిందా?"

"ఊ..."

"మరి సమాధానం చెప్పొచ్చుగా?"

"ఏం సమాధానమిమ్మంటావ్?"

"మీ ఆ నవ్వుకు గల కారణం సమాధానంగా కావాలి."

"నవ్వుకు కూడా సంజాయిషీ ఇచ్చుకోవాలా?"

"మీరు ఇప్పుడు నవ్విన నవ్వులాంటిది ఎంత బాధించేదిగా వుంటుందో మీకు తెలీదు."

"నవ్వులో అన్ని రకాలుంటాయని నాకు తెలీదు."

"అమాయకులు! తెలీకుండానే ఆ ప్రతిభను కనబరుస్తున్నారా?"

"నువ్వూ అమాయకురాలివి కాదు."

"నేను చేసి మాయేమిటి?"

"మరొకరివైపు ఒక వేలు ఎక్కుబెట్టినప్పుడు జరిగేదేమిటో తెలుసు గదా! ఆమె ఇష్టం. ఎవరితో ఇష్టమయితే వాడితో తిరుగుతుంది. అయినా అలాంటి తిరుగుడు కారణంగాగాక, ఆమె రాకపోవటానికి వేరే కారణాలు వుండొచ్చుగా. భర్తకో, కావల్సిన వాళ్లకో ఏ జబ్బో, పచ్చకామెర్లలాంటిది వచ్చి వుండొచ్చు. ఆమెకే ఒంట్లో..." కటువుగా అంటున్న మాటలు ఆపేశాడు, కుర్చీలోంచి లేచి లోపలికెడుతున్న ఆమెను చూస్తూ.

దమయంతి నిజంగానే తనను ప్రేమించి, డబ్బు మీద మోజుతో అదివున్న మరొకడిని పెళ్లి చేసుకోకుండా, తననే చేసుకుని వుంటే జీవితం మరోలా ఉండేదా అన్న ప్రశ్న ఎప్పటికప్పుడు సమాధానం పొందుతున్నా, తలెత్తు తుంటుంది. ఇప్పుడూ అదే జరిగింది. పంకజం స్థానంలో మరో ఆడమనిషి అంతే. మౌలికంగా ఏ మార్పూ వుండదు. చేజారిన దాని గురించి చింత ఎప్పుడూ వుంటుంది. అది చేజారకుండా వుంటే మరో అసంతృప్తి. ఆనందం మాట పక్కనుంచి వేదనన్నా లేకపోతే బతుకు మరీ నిర్జీవంగా వుంటుందనా ఇది వుంది?

చీకటి నేత పనిని ప్రకృతి యథావిధిగా చేసుకుపో తోంది. పగటి వెలుతురు పోంగానే చుక్కలు పొడుచు కొస్తున్నాయి. ఆకాశం కోటి కళ్లు విప్పుతున్నట్టు, చూడ టానికి ఏ వింతుందిక్కడ. ముసురుకుంటున్న చీకట్లో పసుపు పచ్చటి తంగేడు పూలు.

చీకటిగదిలో మంచంమీద పడుకుంది పంకజం. ఆ మాటలు పార్వతి మీద కోపం, అసూయలతో అన్నవి కాదు. రసహీనమైన జీవితంలో సంభవించేవి, తారస పడేవి అతి సాధారణమైనవి, ఆలోచనకు అనర్హమైనవి అయిన విషయాలు. వాటిలో మన ప్రమేయం లేకుం డానే ఆసక్తి ఏర్పడిపోతుంది.

ఎంతకాలమైనా కొన్ని జ్ఞాపకాలు వదలవు, అవి కలిగించే బాధ మానదు. డాక్టర్ కాలం మాపలేని బాధ. చీకట్లో రెండు పచ్చటి కళ్లు తెరుచుకుని చూస్తున్నాయి. ఎంత ఘాతుకమయింది జీవితం? ఆ సంఘటన జరగ కుండా వుంటే జీవితం ఎలా వుండేది. ఇన్నేళ్ల తర్వాత, ఈ వయసులో జరగని దాని గురించి దూరమైపోయిన వ్యక్తి గురించి ఆలోచించి, బాధపడటం అసంబద్ధంగా తోస్తుంది.

అతనూ తనూ ఉండవల్లి వెళ్లింది నిన్ననో మొన్ననో అనిపిస్తుంది... కాలినడకన తిరిగి వస్తున్నారు టొమాటో చేలలోనించి... ఏం మాట్లాడుకున్నారో ఒక్క ముక్క గుర్తులేదు. మాట్లాడుకున్న మరుక్షణమే అవన్నీ మరిచిపొయ్యుంటారు... జ్ఞాపకాల్లో మిగిలిపోవటానికి మాట్లాడుకోలేదు... మాటలు కాదు ప్రధానం, ఏదో ఓపాటి మాట్లాడుకోటం... సాయంసంధ్యలో సీతానగరం వైపునించి బేరేజ్ చివర నుంచి నదిలోకి దిగి నడుస్తు న్నారు. అలసట ఎరుగని నడక, అలసట వున్నా గమ నికకు రానిది... లాకుల నించి లీకవుతున్నదో, అతి కొద్దిగా వదిలినదో నీరు పాదం ఎత్తుకు మాత్రం పారు తోంది. సగం దూరం వచ్చివుంటారు. ఆకాశాన్ని సగం వరకే కప్పిన నల్లమేఘాలు ఇక్కట కురవటం చాలా అవసరమన్నట్లు దూసుకు వచ్చి కురవటం ఆరంభిం చాయి. నది మీద, రైలు వంతెన ఆవల ఎండ, ఇక్కడ వర్షం... కుండపోతగా కాదు, అలవోకగా. అతని కళ్లు ఎర్రగా వున్నాయి. జ్వరంతో వున్నాడు... ఆయాసం కన బడకుండా వుండటానికి ప్రయత్నిస్తున్నట్లు అనిపిం చింది. అలసట కనిపిస్తోంది. వర్షం, ఎండలానే ఏదో బాధ, సంతృప్తి కనిపించాయతనిలో. తను ఎర్ర ముఖ మల్ జాకెట్టు వేసుకుంది. ఏ చీర కట్టుకుందో అసలు గుర్తులేదు. జాకెట్టు రంగు జ్ఞాపకం చెరగకుండా ఎందు కుండిపోయింది? అవతలి ఒడ్డు చేరారు. ఇద్దర్నీ తడిపి, పనైపోయినట్లూరుకుంది వర్షం... "గదికొచ్చి తల, బట్టలు ఆరబెట్టుకుని వెళ్లు," అన్నాడు... వెళ్లింది. "అమ్మ ఎదురు చూస్తుంటుంది, వెళ్లిపోతా," అంటూనే వుండిపోయింది, అవసరమైన దానికన్నా ఎక్కువసేపు.

అతను ఆమెకు లొంగిపోలేదు. ఆమె అతనికి లొంగిపోలేదు. ఇద్దరూ కోర్కెకు లొంగిపోయారు. గది వదలి వెళ్లిపోతుంటే ఆమెకు ఏడుపొచ్చింది. అది వదిలి పోతున్నందుకుగాదు. మరో ఇరవై రోజులు ఓపిక పట్ట లేకపోయినందుకు. అతనికి తల్లి లేదు. పంకజానికి తండ్రి లేడు. ఆర్భాటం లేకుండా, ఎవరినీ పిలవ కుండానే తంతు పూర్తి చేద్దామనుకుని ముహూర్తం పెట్టారు అతని తండ్రి, పంకజం తల్లి. మరుసటి రోజు జ్వరంతోనే మదరాసులో ఇంటర్వ్యూకెళ్లాడు. మొండి జ్వరంతోనే వారంరోజులు తిరిగి వచ్చాడు. పచ్చకామెర్లు ముదిరిపోయాయి. సరైన వైద్యం, జాగ్రత్తలూ లేకపో వటం వల్ల పెళ్లి ముహూర్తం, చావు ముహూర్తంగా మారి పోయింది. ఆఖరిసారిగా పచ్చకళ్లతో అతను చూసిన చూపు గుర్తుండిపోయింది పంకజానికి.

మరో పదిరోజులకు తల్లి చలపతితో పెళ్లి చేసింది. పెళ్లయిన అయిదో నెల్లో గర్భస్రావం. భర్త బాధపడలేదు. దానితో తనకేమీ సంబంధంగాని, ప్రమేయంగాని లేనట్లు, నిజానికి జీవితాంతం కొనసాగుతుందేమోనని భావించిన సమస్యకు పురిట్లోనే సంధికొట్టింది. తర్వాత ఆమె గర్భం దాల్చలేదు.

*

ప్రియుడితో పార్వతి, తన ప్రత్యేకమైన శైలిలో పలకరించి కనకదుర్గగారూ వెళ్లిపోయి పావుగంట య్యుంటుంది.

ఘనీభవించినట్లు కనిపిస్తున్న సముద్రాన్ని చూస్తూ, ఇద్దరూ ఒకేసారి ఆవులించి నవ్వుకున్నారు.

సంబంధన్ ఇంట్లో ఏదో కోలాహలం. సంబంధన్ గేటు దాకా వచ్చాడు. సిటౌట్లో నిలబడి అతని భార్య జరిగే తంతు చూస్తోంది. పనివాడు ఏదో చేస్తున్నాడు. పామేమైనా వచ్చిందా? కుర్చీలలోనించి లేచి ప్రహరీ గోడ దగ్గరికొచ్చి నిలబడ్డారిద్దరూ. నల్లమచ్చల తెల్లకుక్క మెడకున్న ఇనప గొలుసు తీసి సిటౌట్లోకి విసిరేశాడు సొట్టపనోడు. వాడి చెయ్యి చాలా బలంగా వుంటుంది. రెండో చేతికి పక్షవాతం, ఏ వయసులో వచ్చిందో. అయితే ఆ చేతినీ వీలయినంత మేరకు ఉపయోగిస్తాడు, ఏదైనా పనిలో రెండు చేతుల అవసరం పడితే. నల్లమచ్చల తెల్లకుక్క బతికున్నప్పుడు దానికి చేతగాని మౌనాన్ని ఇప్పుడు పాటిస్తోంది. దాని చావుకు సంతాప సూచికంగా మౌనం పాటిస్తున్నట్లుంది. రెండు నిమిషాల పాటు మాత్రం కాదు. తాడు కడుతున్నాడు సొట్టోడు దాని మెడకు. లేచాడు. లాక్కుపోతున్నాడు దాన్ని. మెడకేసి వుంచిన ఇనపగొలుసు మిగిలిందిపుడు. చచ్చిన కుక్కకన్నా మిగిలిన గొలుసు విలువైనది. కుక్క ప్రాణంతో వున్నప్పుడు గొలుసుకన్నా అది విలువైనది. కుక్కా, దంపతుల భాషా సొట్టోడికి తెలీదు. కుక్కా, సొట్టోడి భాష దంపతులకు తెల్సేది కాదు. కుక్కకు వాళ్ల ముగ్గురి ఉద్దేశాలు, భావాలు అర్థమయ్యేవి కాదు. అయినా అంతా ఒకే కప్పు కింద వున్నారు.

దాని మొరుగుడు గురించే బహుశా, పాలూ మాంసం పెట్టి పెంచుకున్న కుక్క. చావువల్ల మూగబోగా, ఇనప గొలుసు దాచేసుకుని, చచ్చిన దాని మెడకు ఉరేసి, సొట్టోడి చేత అవతలికి లాగించేస్తున్నారు. పక్షవాతపు చెయ్యి పొట్లకాయలా వేలాడుతుంటే, రెండో చేత్తో తాడుకొస పట్టుకుని లాక్కుపోతున్నాడు వాడు. పక్షవాతపు చెయ్యి చంకలో గునపం వుంది. కనిపించేంత దూరంలో వున్న మామిడి చెట్టుకు కాస్తంత ఇవతల ఆగి నాలుగు పక్కలా చూస్తున్నాడు. మెత్తటి నేల గురించేమో గునపంతో ఒకచోట తవ్వుతున్నాడు.

పంకజం సమాధి కాబోతున్న కుక్కను ఆఖరి చూపు చూడటానికి బయలుదేరింది. అతనూ వేరేచోటికి బయలుదేరుతూ, ''నేనిపుడే వస్తానని,'' బయలుదేరాడు. ''వెళ్లండి, నేను దూరంగా ఎక్కడికీ వెళ్లటం లేదు,'' అని నెమ్మదిగా నడుస్తూ కుక్కను చేరింది.

వాడు రొప్పుతూ తవ్వుతున్నాడు. పలకరింపుగా పలకరించి, ఆఖరిదెబ్బలు వేస్తున్నాడు గునపంతో. కుక్క నోరు కాస్తంత తెరుచుకుని వుంది. చచ్చీ మొరగబోతున్నట్టు, చొంగో, నురగో కారినట్లుంది. పదునైన పళ్లు కనిపిస్తున్నాయి. బతికి వున్నప్పుడు, గొలుసు వదిలి వుంటే ఆ పళ్లతో ఆకులను, గాలినీ చీరేసి వుండేదేమో. సగం తెరిచి వున్న కళ్లకు చీమలు పట్టేశాయి. ''పాము కరిచింది రాత్రి,'' అన్నాడు అడుగబోయిన ప్రశ్న ముందుగా ఊహించి. దీనంగా, గోలగా అరిచిందట. కిటికీ తలుపులు, ఇంటి ముందు తలుపూ రాత్రిళ్లు మూసేస్తారు. గదా అందువల్ల ఆ ఇంట్లోవాళ్లకు అది మామూలు గగ్గోలనిపించి వుంటుంది. మొత్తం మీద కుక్క చావే చచ్చింది. సంబంధన్‌తో, అతని గొలుసుతో సంబంధం తెగిపోయింది చావుతో.

చచ్చిన కుక్కను, తీసిన గోతిని, చచ్చినదాన్ని చంపుతున్న ఉరితాడును, వేలాడే లావుపాటి పొట్లకాయను మార్చిమార్చి చూసింది. అంతా, ఎల్లెడలా నిశ్శబ్దం. గోల జీవానికి, ప్రశాంతతకు ప్రతీకలా? మెడకు కట్టిన తాడు విప్పాడు.

''గట్టితాడు, ఇదెందుకు వదిలెయ్యటం దండగ,'' తీసిన గోతిలోకి కాలితో నెట్టాడు కళేబరాన్ని.

''పాలూ మాంసం తిని ఎంతలా బలిసిందో చూడండి... మాకు మాత్రం ఆళ్లు గంజిమెతుకు లెడతారు,'' కసిగా అని, కసిగానే దాన్ని ఒక తన్ను తన్నేడు. కుక్కతో సమంగా పోషించనందుకు, దానికన్నా ఇంటికీ వాళ్లకూ ఎక్కువ సేవలు చేస్తున్నా, యజమానుల మీద కోపం అలా తీర్చుకుంటూ. తనకి జరగని 'భోగం' అది పొందినందుకు అసూయ. దానికి లేని స్వేచ్ఛ తనకు వుందన్న విషయం వాడి బుర్రకు తట్టదు.

అందుకే చెకోవ్ అన్నాడు, ''అవమానకరమైనది, విచారం కలిగించేదే అయినా కుక్కల్ని చూసి అసూయ పడే మనుషులు చాలామంది వున్నారన్న విషయం, నిజం.''

ఇంటివైపు మళ్లింది. సొట్టోడు తాడును చేతికి కట్టుకుని కూనిరాగం తీస్తూ వస్తున్నాడు. వాడి పోటీదారుడెవడో శాశ్వతంగా నిష్క్రమించిన రిలీఫ్ కనిపిస్తోంది వాడిలో.

ప్రాణంపోయిన మరుక్షణం కుక్కతో ఎవరికీ పని లేదు. అది అనుక్షణం అయినదానికీ, కానిదానికీ మొరుగుతూ, ఒంటరిగా బతికి, తనదంటూ ఒక దిక్కు లేకుండా చచ్చింది. దాని బతుకూ, ఆ చావూ రెండూ ఒకేలాంటివి, నికృష్టమైనవి.

చాలాసేపయింది. చలపతి ఇంకా ఇల్లు చేరలేదు. సిటౌట్లో ఎదురుచూస్తూ కూర్చుంది. త్వరగా తిరిగి రానందుకు అతన్ని తిట్టుకుంటూ. ఒంటరిగా,

ఆలోచనలు తినేస్తూ గడపటం నయమా, ఒకరినొకరు తిట్టుకుంటూ ద్వేషించుకుంటూ జంటగా గడపటం నయమా? జీవితంలో ఏ రెండు ప్రత్యామ్నాయాలూ ముందు నుయ్యి, వెనక గొయ్యిని పోలినవే. తీరా నిర్ణయం తీసుకున్న తర్వాత గోతిలో వున్నప్పుడు (బతికి బట్టకడితే) నుయ్యే బాగుండేదేమోననిపిస్తుంది. నూతి లోకి చేరితే (బతికుంటే) గొయ్యే ఎన్నుకుని వుండాల్సింది అనిపిస్తుంది.

*

వర్షం ఆరంభమయింది.

పొద్దున కాఫీ తాగుతున్న సమయానికి నీలపు ఇంటిలోనించి స్త్రీ ఏడుపు వినిపించింది. అటువైపు వెళ్లాడు చలపతి. కనకదుర్గ చనిపోయి వుంది. ఒంటి మీద నగలున్నాయి. శవాలంకరణ. చీర మాత్రం సాదా సీదాది. ఒడ్డాణం లేదు. బహుశా బయటికొచ్చినప్పుడు, ప్రధానమైన రోజుల్లో అది ఆమె నడుముకు అలంకారంగా భాసిల్లుతుండేదేమో! నడుముకు కాస్తంత పైన తామర, నల్లగా అదీ ఒక నగలా. ఈ నగ శరీరాన్నించి వేరుచేయలేనిది. నగలు పోతాయేమోనని, చనిపోయే ముందు కళ్లు తెరిచి వుంచి పోయుంటుంది. కొవ్వు మాంసాల ముద్దను అదేదో అందమైనదానిలా, విలువైన దానిలా అలంకరించటమేమిటో! అది అలంకరణ కాకపోతే, ఉన్న సంపదను ప్రదర్శనకు పెట్టే ఒక విధానం కావచ్చు. ఈ విషయం ఇంటికెళ్లిన తర్వాత భార్య ముందు వ్యాఖ్యానించాడు.

ఏడవాలా వద్దా! అన్న సందిగ్ధంలోనో, మరే కారణంచేతో గడపకు అటొక కాలూ, ఇటొక కాలు వేసి వెర్రిమొహంతో చేతులు పిసుక్కుంటున్నాడు భర్త. ఎలాంటి సందిగ్ధంలేని, అవివాహిత మరదలు మాత్రం ఏడుస్తోంది. చెట్లన్నీ ఊగుతున్నాయి. గాజు కిటికీ రెక్కలు కొట్టుకుంటున్నాయి. వాటిని మూసేయమని సంబంధన్ ఆంగ్లంలో అన్నాడు తిరుమలరావుతో. లారీల ఓనరుగారు తిరుమలరావు మరదలితో,

''అమ్మా! ముక్కుపుటాల్లో, చెవుల్లో దూది పెట్టండి,'' అన్నాడు.

''రెండు కాలి బొటనవేళ్లని కలిపి దారంతో కడతా రనుకుంటాను,'' అన్నాడు చలపతి.

ఆ రెండు పనులూ జరిగాయి. తెరిచి వున్న ఆమె కనురెప్పలు భర్త మూసేశాడు. ఏం చూస్తుందో చూడ గూడదన్నట్లు.

''నాల్రోజుల నించి వంట్లో బాగాలేదు. ఆస్పత్రిలో చేర్చమని డాక్టరు చెప్పాడు. చావనైనా చస్తాగాని ఆస్పత్రి పాలు కానంది. ఇంటి దగ్గర చికిత్స జరుగుతోంది. ఆమె పరిస్థితి రోజు కన్నా రాత్రే బాగుంది. నిన్న సాయంత్రం కాస్త దూరం నడిచి వచ్చింది కూడా. కోలుకుందను కున్నా...'' గొంతు ఆఖర్లో బొంగురుగా ధ్వనించింది.

హుస్సేనుగారి భార్య, ''ఆమె తల దగ్గిర దీపం పెట్టండి,'' అంది. మరదలు కాస్త ఏడుపు ఆపి, మెలి కలు తిరుగుతూ లోపలికెళ్లింది. ప్రమిదలో నూనెపోసి ఒత్తివేసి వెలిగించి తెచ్చి శవం తలవైపు పెట్టింది. బయటి మెరుపులు గాజు కిటికీల మీద మెరుస్తున్నాయి. ప్రాణంతో వున్నప్పుడే కనకదుర్గ ఒక వింత. మరణించి, ఆ వింతను ఇనుమడింపజేస్తోంది.

అతను ఫోను దగ్గిరకెళ్లి మూడు ఎస్టీడీ కాల్స్ చేసి, జరిగిన విషయం కంఠం తగ్గించి వివరించి, కిటికీలో నించి బయటకు చూస్తూ, సాయంత్రం దహనానికి తీసు కెళ్తామని చెప్పాడు. కిటికీలోనించి, పడే వర్షం కనిపిస్తోంది, వినిపిస్తోంది కూడా. తుఫానా? సాయంత్రానికి తగ్గుముఖం పట్టి మూడు గంటలపాటు తెరిపిస్తే చాలు. గదిలో ఉక్కగా వుంది. ఫ్యాను వేద్దామని స్విచ్‌బోర్డు దాకా వెళ్లి, వెలిగే దీపం గుర్తొచ్చి ఆమె తలవైపు కింద కూర్చున్నాడు.

మరదలు నైటీలో వుంది, పూలనైటీ. వంటిని బిగుతుగా, ఇష్టంగా పట్టి వుంది. జనం అంత త్వరగా వస్తారనిగాని, తను ఆ ఉడుపు దాల్చి వున్నాననిగాని, అక్కగారి హడావుడిలో పట్టించుకునే వీలు కలిగి వుండదు. దూది తేవడానికి వెళ్లినప్పుడు తువ్వాలు భుజం మీది నించి వేసి పైభాగాన్ని కప్పుకుని వచ్చింది. అయితే అది పూర్తిగా సరిపోలేదు. నూనె దీపం గురించి లోపలికెళ్లి నప్పుడు ఆ తువ్వాలు అవతల పారేసి వచ్చింది. తువ్వాలుతో అవస్థ పడటంకంటే, చూసేవాళ్ల చూపులు పట్టించుకోకుండా వుంటే సరిపోతుందన్న జ్ఞానంతో నేమో! వేరే తువ్వాలు కప్పుకుని వచ్చినా ఆ విషయానికి అలాంటి సమయంలో, అంత ప్రాధాన్యత ఇచ్చినట్లు కనబడుతుంది ఎదుటివాళ్లకు, అని కూడా కావచ్చు.

హుసేనుగారి భార్య నైటీల్లో తిరిగేటప్పుడు ఒక సారి పంకజానికి, చలపతికి వాదన జరిగింది.

''అంత ఇరుకైన నైటీ ఎవరేసుకోమన్నారు. టవళ్ల తో జేబురుమాళ్లతో పైభాగాన్ని ఎవరు కప్పుకోమన్నారు. ఆవిధంగా కప్పుకోవటం వల్ల మామూలుగా ఆ విషయాన్ని గమనించని వాళ్లు దృష్టి మరికొంతసేపు అక్కడ నిలపటానికి కాకపోతే.''

"వేసుకునే బట్టల ఇష్టాయిష్టాలు వాళ్ల వ్యక్తిగత విషయాలు. వాటి గురించి మనం ఎందుకూ వాదు లాడుకోటం?"

"వ్యక్తిగతం ఎలా అవుతుంది. నలుగురి మధ్య వున్నప్పుడు."

"కర్రలాంటి శరీరాలూ, మగాడి వక్షాలూ వున్న వాళ్లకి అసౌకర్యం వుండదు. పొందికగా, శరీరం మీద ఒక కేజీ మాంసం ఎక్కువ వున్నవాళ్లకు వీలుగా, సుఖం గా అనిపించే అలాంటి బట్టలు వేసుకోవాలని వుంటుం దిగా... ఆ విషయాన్ని అంతలా తప్పు పట్టకూడదు."

చెరచెరా ఆ కర్రలాంటి మనిషి లోపలికెళ్లిపో యింది. ఆ సంఘటనల ఫలితం రెండ్రోజుల శీతల యుద్ధం.

వర్షంలో, ఎవరో కాలింగ్‌బెల్ కొట్టారు. తలుపు తీశారు. కొత్తవాళ్లెవరో నలుగురు ఆడామగా చూడటానికి వచ్చారు. చలపతి బయటికి నడిచాడు. అతనితోపాటు సంబంధన్ నడుస్తున్నప్పుడు చెప్పాడు కొత్త కుక్కను కొనబోతున్నానని.

ఇంటికొచ్చి కనకదుర్గ 'అలంకరణ' గురించి చలపతి వ్యాఖ్యానించినప్పుడు ఆమె అంది.

"అదీ వ్యక్తిగత వ్యవహారంగా తీసుకోవచ్చుగా, నైటీలాగే?"

నిజమే సుమా అనిపించింది చలపతికి, అయినా అన్నాడు...

"మనిషిలో పరస్పర విరుద్ధమయిన భావాలు పుడుతుంటాయి. ఒకే రకమైన రెండు సంఘటనల మీద ఒకసారి ఒకలా, మరొకసారి ఇంకోలా అభిప్రాయాలు వెల్లడిస్తుంటాం. మానవనైజం."

"ఆహా! మీ తప్పులకు ఏదో ఒక థియరీని ప్రతి పాదించి, వాటిని కప్పిపుచ్చుకోటం ఒక అలవాటు. ఎవరు చెప్పారూ! అదీ మానవ నైజమేనేమో."

వార్తాపత్రికలో తలదాచుకున్నాడు.

పగలంతా వర్షం కురుస్తూనే ఉంది. కొద్దిసేపు అప్పుడప్పుడూ ఊపిరి తీసుకుంటూ మధ్యాహ్నం దాటు తుండగా జోరు తగ్గి, సాయంత్రానికి తెరిపిచ్చింది. కనక దుర్గను మోసుకుపోతున్నారు ఇంటి ముందునించి. ఎక్కువమంది బంధువులు రాలేదు. తెలిసినవాళ్లు, స్నేహితులు పొద్దుటినించి వచ్చి చూసి ఒక బాధ్యత తీరినట్లు వెళ్లిపోగా కొద్దిమంది మాత్రం మిగిలారు. కాలు సాగినట్లుంటుందని చలపతి వాళ్లతో నడవటం మొదలుపెట్టాడు. స్మశానానికి అడ్డదారిన వెళుతు న్నంతసేపూ చిన్నజల్లులు తాకుతూనే వున్నాయి.

'ధార'కు ఇవతల చింతచెట్టుకు కాస్తంత ముందు స్మశానాలు రెండు. అటు ప్రాంతంలో ఎక్కువగా వున్న ఒక కుల జనాభాకు సంబంధించిన శవాల్ని కాల్చటాని కొకటి, మిగతావాళ్లు బూడిదలవటానికింకొకటి. బూడిదల విషయంలోనూ భేదం. చలపతి, మరికొంత మంది పనసచెట్టు కింద నిలబడ్డారు. కనకదుర్గ కొడుకు మరొక వూరి నించి వచ్చాడు. అతగాడి ద్వారా తంతు జరిపిస్తున్నారు. భర్త గొంతుక్కూర్చుని చూస్తున్నాడు. మొత్తం మీద పొడికర్రలు చాలానే సంపాయించారు. స్మశానవాటిక తాలూకు వ్యక్తి అవి తగువిధంగా పేర్చిన తర్వాత ఆమెను పడుకోబెట్టారు. పైన కర్రలు పేరుస్తు న్నప్పుడు మనుషులు పనసచెట్టు కిందనించి కదిలి దగ్గరగా వచ్చారు.

ఆమె మీద ఒక్క నగా లేదు. కర్రలు పేర్చబడు తున్నాయి. బోసిపోయి, నిలువుదోపిడీకి గురైన మనిషిలా తోస్తోంది. ఆకుపచ్చ అంచు ఎర్రచేనేత చీరలో వుందామె. అది జరీ అంచు కాదు. నగలను, పట్టుచీరలను మిగిల్చి పొడెక్కింది కనకదుర్గ. ఆమెతో వెళుతున్న తామర నగను కర్రలతో మూసేశారు. పట్టుచీరెల, బంగారాల ఆమె భ్రమపూరిత జీవితానికి ఈ చావు యవనిక.

చలపతి ఆకాశంకేసి చూశాడు. వర్షం పడకూడ దని ప్రార్థించాడు. చాలా విచారం కలిగింది. ఇంతవరకూ ఒకే ప్రాంతంలో వుంటూ వచ్చి, రోజూ ఇంటి ముందు నుంచి రొప్పుతూ వెళుతూ, 'ఏవండీ,' అంటూ వచ్చిన పరిచయమైన వ్యక్తి శరీరం కాలిపోతున్నందుకు. ఆమె గడిపిన జీవితం కించిత్ అసూయా కలిగించింది. భ్రమ గాదన్న ఆనందం, సంతృప్తితో గడిపినదది.

దూరంగా, దట్టంగా వున్న వృక్షాలూ, పిచ్చి మొక్కల మధ్య నించి గాడిద ఓండ్ర పెడుతోంది (గౌరవ సూచకంగానా?) కొడుకు, పదిహేనేళ్లవాడు కుళ్లికుళ్లి ఏడుస్తున్నాడు. ఉత్తరీయంతో తండ్రి కళ్లు తుడుచు కున్నాడు.

గంటకుపైగా వుండి ఇంటికొచ్చేసరికి చీకటి పడింది. వర్షం కురవటం పునఃప్రారంభం కాలేదు. రంగులేని ఆకాశం. వరండాలో పేము కుర్చీలో శరీరాన్ని కుదేశాడు. పంకజం ఆసక్తితో చూస్తోంది అతనివైపు. దహనకాండ వివరాలు చెబుతాడేమోనని. అది గమ నించకపోలేదు అతను. ఏం వింతలుంటాయి. ఎవరు చచ్చినా ఒకటే తంతు. కాకపోతే ఆ సమయాన గాడిద ఓండ్ర పెట్టడం, పెట్టకపోవటం అన్నదే తేడా దీనికి, మరొకదానికి.

చుక్కలు కూడా మబ్బు మరుగున పడి చీకటి మరీ దట్టంగా వ్యాపించి వుంది జీవితపు బోర్డమ్‌లా. ఆపైన నగరం వెలిగించి పట్టుకున్న దివిటీలు. వాటినీ దాటి, ఇంకా పైగా కనపడని స్మశానపు రంగు సముద్రం. దట్టమయిన మొక్కల్లో వీటి మధ్య నుంచే వేయి నౌకలను జలప్రవేశం చేయించగలిగిన ముఖం గల పార్వతి, అంగరక్షకుడిలాంటి ప్రేమికుడితో నడిచి వచ్చేది, వెళ్లేది. పురుగో పుట్రో చప్పుళ్లు చేస్తున్నాయి. మిణుగురు పురుగు దాని వెలుతురే దానికి మార్గం చూపించలేకపోతున్నట్లు, చీకట్లో పల్టీలు కొడుతూ వెళుతోంది. తోడు లేని పయనం, గమ్యరహితమయినదీను.

కాలం కదలకుండా, అచేతనమయింది. ఇన్ని సంవత్సరాలూ నడిచీ, పరిగెత్తీ, తాము త్వరపడుతున్న తరుణాన జీవిత పయనానికి గమ్యం చావు. నిజానికి తమది పయనం కాదు. కదలకుండా ప్లాట్‌ఫాం మీద నిలబడి కదిలే రైలువైపు తదేకంగా చూస్తున్నప్పుడు, అదేకాక మనమూ కదిలిపోతున్నామనిపించే భ్రమ. కాలం నిరంతరం వెళ్లిపోతుంటుంది. ఒక రైలుబండిలా మనలను దాటుకుని వెళ్లిపోవటమంటూ వుండదు. దానికి తుది, అంతం లేదు. దాని ప్రభావం కళ్లకు కనిపిస్తూనే వుంటుంది. చావును అదే మన గుమ్మం ముందుకు తెస్తుంది.

గేటుకవతల చీకట్లో ఎవరో నిలబడి వున్నారు. మాట్లాడటం లేదు. "ఎవరూ?" కేకేసింది పంకజం.

"నేనండమ్మా అప్పలకొండని," సమాధానంగా వినిపించింది. ఆమె గేటు దగ్గిరకెళ్లింది.

"ఏం ఇలా వచ్చావు?"

"ఇదెళ్లిపోయిందేంటమ్మా?"

'అసలొస్తేకదా ఈపూట...' అనబోయి తమాయించుకుని, "ఆ ఇపుడే వెళ్లింది," అన్నది. అబద్ధం.

ఆ అబద్ధం ఇద్దరికీ శ్రేయోదాయకం. అబద్ధమేమిటి, నిజమేమిటి? గేటు దగ్గిరే నిలబడిపోయింది. చీకట్లోకి చూస్తూ వింతను చూస్తున్నట్లు, కొత్త విషయాన్ని చూస్తున్నట్లు. రమారమి యాభయ్యయిదు సంవత్సరాలుగా చూస్తున్నదే! అనుభవిస్తున్నదే! దేని గురించో, ఎవరి గురించో ఆహ్వానం పలకాలన్నట్లు నిలబడింది. దూరంగా మామిడిచెట్టు. చీకటి చిక్కబడినట్టు కనిపిస్తోంది. దానికి కాస్త దూరాన, సొట్టోడు కాలితో తన్ని గోతిలోకి తోసి మట్టికప్పిన కుక్క భూమిలో విలీనమవుతూ, చావు జోక్యంతో దాని అత్యాచారం నించి విముక్తి పొందిన నిశ్శబ్దం.

చీకట్లో రెండు మిణుగురులు ఒంటరిగా వెళుతున్నాయి, ప్రయాణపు మొనాటనీని మరచిపోవటానికి అపుడపుడూ పల్టీలు కొట్టుకుంటూ. వాటి ప్రయాణానికి అవే తప్ప వేరే వెలుగు చూపించే దిక్కులేక.

పయనపు గమ్యం చేరేవరకూ ఒకదాని తోడు మరొకదానికి వుంది, కనీసం సంతోషం, గొప్పదనం! ఒకటి చచ్చి మరొకటి మిగిలితే మిగిలిన దానికి చచ్చే చావు.

ఈ క్షణాన ఇద్దర్నీ పీడిస్తున్న భయమూ అదే.

కేవలం మరణించడం గురించే జీవిస్తున్న వాళ్ల భయం!

*విపుల, ఫిబ్రవరి 1996*

